క్లుప్తంగా

కృష్ణాష్టమి వేడులకు ఏర్పాట్లు పూర్తి

మాకవరపాలెం: కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక బీసీ కాలనీలో గల కృష్ణుడి ఆలయం వద్ద గురువారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలతోపాటు మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించనున్నట్టు కమిటీ తెలిపింది.

ఉత్తమ ఉపాధ్యాయిని రమణికి అభినందనలు



కలెక్టర్, ఎంపీల నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న రమణి

చోడవరం రూరల్: ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికై, మంగళవారం కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎంపీ భీశెట్టి సత్యవతిల నుంచి అవార్డు పొందిన ఉత్తమ పి.వి.రమణిని సహ ఉపాధ్యాయులు అభినందించారు. పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(మెయిన్)లో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న రమణి సేవలను ప్రభుత్వం గుర్తించి అవార్డు ఇవ్వడం పట్ల మండల విద్యాశాఖాధికారులు జయలక్ష్మి, సింహాచలం, కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి, సీఆర్‌పీ కె.వి.ఎం.నాయుడు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

పోతనపూడిలో నా భూమి - నా దేశం



పోతనపూడిలో పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

మాడుగుల రూరల్: నాభూమి - నాదేశం, పవిత్ర మట్టి సేకరణ కార్యక్రమాన్ని బుధవారం పోతనపూడి గ్రామంలో నిర్వహించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ఉండూరు రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు పుట్టా రాంబాబు, ఎం.సంతోషి సుబ్బలక్ష్మి, నాభూమి-నా దేశం జిల్లా ఇన్‌చార్జి భరిణికాన అప్పలకొండ కుమార్, నియోజకవర్గ కన్వీనర్ మేడపురెడ్డి శ్రీనివాస్, జిల్లా సోషల్‌మీడియా కన్వీనర్ పెంటకోట జగదీష్, జిల్లా కార్యదర్శి ధర్మిశెట్టి నారాయణరావు, మండల ప్రధాన కార్యదర్శి మట్టా చంటి, పాచిల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వాలిన వెదురు పుంతలతో ప్రమాదాలు



నర్సీపట్నం తుని మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వాలిన వెదురు పుంతలు

నాతవరం: నర్సీపట్నం, తుని మధ్య పెడిమికొండ అటవీ ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పైకి ఎత్తయిన వెదురు పుంతలు వాలిపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తాండవ జంక్షన్ నుంచి గాంధీనగరం మధ్య సుమారు మూడు కిలో మీటర్ల పొడవున రోడ్డుపై వెదురు పుంతుల కొమ్మలు వేలాడుతున్నాయి. దీంతో వచ్చేపోయే వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ద్విచక్ర వాహనదారులు పలుమార్లు ప్రమాదాలకు గురయ్యారు. ఇప్పటికైన పోలీసు, అటవీ, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న వెదురు పుంతలను తొలగించాలని ఈప్రాంతీయులు కోరుతున్నారు.

నేడు దివంగత నేత జమీలు విగ్రహ ఆవిష్కరణ

నాతవరం: మండల కేంద్రం నాతవరంలో గురువారం దివంగత నేత అంకంరెడ్డి జమీలు విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్టు ఉప సర్పంచ్ కరక అప్పలరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్, మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, నర్సీపట్నం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు పాల్గొంటారని ఆయన చెప్పారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

ముకుందా..ముకుందా..



కె.జె.పురంలో శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న భక్తులు



ఏఎల్‌పురంలో ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కె.కోటపాడు కృష్ణాలయంలో పూజలను చేస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్



దొండపూడిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పలు గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, ఉత్సవవిగ్రహాల ఊరేగింపు, ఉట్టికొట్టే సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో అన్నసమారాధనలు జరిపారు. ఈకార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

- గ్రామాల్లో ఘనంగా శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు
- ఉత్సాహంగా ఉట్టికొట్టు సంబరాలు



చోడవరంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా తెల్లవారజాము నుంచి శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఉపముఖ్యమంత్రి ముత్యాల నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని, స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీకృష్ణుని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. యాదవ సంఘం పెద్దలు, యూత్ సభ్యులు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును ఘనంగా సత్కరించారు. అనంతరం ఉట్టి కొట్టు ఉత్సవాన్ని ఆయన తిలకించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వైస్ ఎంపీపీ ఉగ్రూకుల గంగాభవానీ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ తదితరులు శ్రీకృష్ణుని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. తప్పెట గుళ్ల ప్రదర్శన, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

మాడుగుల రూరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గ్రామాల్లో బుధవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. కె.జె.పురం రామాలయంలోని శ్రీకృష్ణ ఉపాలయంలో పూజలు నిర్వహించారు. అంతకు ముందు గ్రామంలో కృష్ణుడికి విగ్రహాన్ని ఊరేగించారు. ఎం.కోడూరులోని గోపాల కృష్ణ ఆలయంలో ఉదయం నుంచి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. సాగరం గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

గొలుగొండ: కృష్ణాష్టమి సందర్భంగా ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏఎల్ పురం, గొలుగొండ, చీడిగుమ్మల, ఏటిగైరంపేట తదితర గ్రామాల్లో ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు జరిపి, అన్న సమారాధన నిర్వహించారు.

కె.కోటపాడు: స్థానిక కృష్ణాలయంలో బుధవారం ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీకాంత్ శ్రీను, మొల్లి అప్పలనాయుడు, గజ్జి ఈశ్వరరావు, గజ్జి గంగాధర్, యలమంచిలి ధర్మారావు, నంబారు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నాతవరం: మండలంలో వాడవాడలా బుధవారం ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. జిల్లేడుపూడి, డి.యర్రవరం,పి.కె.గూడెం, నాయుడు పాలెం, నాతవరం గ్రామాల్లో గల కృష్ణాలయాల్లో ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రావికమతం: మండలంలోని దొండపూడి,కొత్తకోట గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. దొండపూడిలో శ్రీకృష్ణాలయంలోనూ, కొత్తకోటలోని శ్రీరాధాకృష్ణ ఆలయంలోనూ తెల్లవారుజామునుంచి భక్తులు విశేషపూజలు, అభిషేకాలు, ఉట్టికొట్టే సంబరం నిర్వహించారు.

రోలుగుంట: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రోలుగుంట, వడ్డిప తదితర గ్రామాల్లోని వేణుగోపాల స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

చీడికాడ: మండలంలోని పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చుక్కపల్లి, బి.సింగవరం,జె.బి.పురం,దండిసురవరం తదితర గ్రామాల్లో శ్రీకృష్ణుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయాల వద్ద అన్నసమారాధన, సాయంత్రం ఉట్టి కొట్టే సంబరం నిర్వహించారు.

చోడవరం: మండలంలో వాడవాడలా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చోడవరం పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తిరుమల తిరుపతి దాసరి సాహిత్య కోలాట బృందం నృత్యాల మధ్య స్వామివారి జన్మాష్టమి వేడుకలు సందడిగా జరిగాయి. ఆలయ అర్చకుడు కొడమంచిలి చలపతిరావు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి ఉదయం నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వెంకన్నపాలెం, గంధవరం గ్రామాల్లో కృష్ణుడి ఆలయాల్లో కృష్ణాష్టమి వేడుకలు సంబరంగా జరిగాయి. ఉట్లను కొట్టి యువకులంతా ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరిపారు. రాధా కృష్ణుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై తిరువీధోత్సవం నిర్వహించారు.

నర్సీపట్నం: పట్టణంలో కృష్ణాబజార్‌లో ఉన్న శ్రీకృష్ణుని మందిరంలో కృష్ణాష్టమి వేడుకల బుధవారం ఘనంగా జరిగాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణుని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి బారులు తీరారు. కృష్ణాష్టమి వేడుకలతో కృష్ణాబజార్‌లో సందడిలో నెలకొంది.

తాగునీటి ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న వైస్‌ఎంపీపీ మత్స భవానీప్రసాద్

రావికమతం: చిలకవానిపాలెం గ్రామంలో 30 వేల లీటర్ల సామర్థ్యం గల తాగు నీటి ట్యాంకు నిర్మాణానికి బుధవారం వైస్ ఎంపీపీ మత్స భవానీప్రసాద్ భూమిపూజ చేశారు. డోలవానిపాలెంలో ట్యాంకు నిర్మాణానికి గురువారం భూమిపూజ చేస్తారని, ఈ పనులు పూర్తయితే తాగునీటికి ఇబ్బంది ఉండదని వైస్ ఎంపీపీ భవానీప్రసాద్, ఆగ్రామ ముఖ్యనాయకులు ఇల్లపు సన్యాసినాయుడు, రామునాయుడు, రమేష్‌నాయుడు,రమణ తెలిపారు.

జోరుగా పీఆర్ అతిథి గృహ నిర్మాణ పనులు



నిర్మాణంలో ఉన్న అతిథి గృహం

మాడుగుల: స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో రూ.1.50 కోట్లతో చేపట్టిన పీఆర్ అతిథి గృహం నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో గెస్ట్ హౌస్ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. మరో నెల రోజుల్లో పనులు పూర్తవుతాయని కాంట్రాక్టర్ తెలిపారు.

త్వరితగతిన అభివృద్ధి పనుల పూర్తి

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



రజక వీధిలో సామాజిక భవనాన్ని పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అధికారులను ఆదేశించారు. స్థానిక రజకుల వీధి, విశ్వబ్రహ్మణ వీధిలో నిర్మాణంలో ఉన్న సామాజిక భవనాలను ఆయన బుధవారం పరిశీలించారు. శ్రీకృష్ణ ఆలయానికి ఆనుకుని డ్రైనేజీ నిర్మాణం చేపట్టేందుకు ఆయన పలు సూచనలు చేశారు. అనంతం నూతన ఎంపీడీవో కార్యాలయ భవనం, పార్కు నిర్మాణ పనులను పరిశీలించారు. డిప్యూటీ సీఎం వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలం నాయుడు, వైస్ ఎంపీపీ ఉగ్రూకుల గంగాభవానీ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు, ఉగ్రూకుల అప్పారావు, వేచలపు అప్పలనాయుడు, గాలి సూర్యలక్ష్మి, కొల్లి ఈశ్వరరావు, వాలేటి నాగరాజు తదితరులున్నారు.

కృత్రిమ గర్భోత్పత్తి ఇంజక్షన్లతో ఆడ పెయ్యిల జననం



పశువుల పెంపకంలో జాగ్రత్తలను వివరిస్తున్న పశువైద్యాధికారి నాయుడు

కె.కోటపాడు : ఏడాదికి ఒక దూడ జన్మించేలా పాడిపశువుల సంరక్షణలో రైతులు జాగ్రత్తలను తీసుకోవాలని కొరువాడ పశువైద్యాధికారి సీహెచ్.వై.నాయుడు తెలిపారు. పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో భాగంగా బుధవారం పాడి రైతులకు ఆయన పశుపెంపకంలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. కృత్రిమ గర్భోత్పత్తి ఇంజక్షన్‌ల ద్వారా ఆడపెయ్యిలను జన్మించేందుకు కావాల్సిన వీర్యాన్ని ప్రభుత్వం తక్కువ ధరకే అందిస్తున్నట్టు తెలిపారు. రెండు డోసుల వీర్యానికి రైతులు రూ.500లు చెల్లించాలన్నారు. ఈ విధానం ద్వారా 90 శాతం ఆడపెయ్యిలు జన్మించనున్నట్టు చెప్పారు. ప్రస్తుత సమయంలో వాతావరణం పాడి పశువులు చూడికట్టేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. 60 శాతం రాయితీపై రైతులకు సమీకృత దాణా(టీఎంఆర్)ను ఇవ్వనున్నట్టు పశువైద్యాధికారి నాయుడు వివరించారు. ఆరోగ్య జాగ్రత్తలను పాటించి, పాడి ద్వారా మంచి ఆదాయాన్ని పొందాలని రైతులకు పశువైద్యాధికారి సీహెచ్.వై.నాయుడు తెలిపారు.

8న నిర్వహించే 'స్పందన'ను సద్వినియోగం చేసుకోవాలి

నర్సీపట్నం ఆర్డీవో హనుమంత వెంకట జయరామ్



మన్యపురట్లల్లో తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడుకు సూచనలు చేస్తున్న ఆర్డీవో జయరామ్

నాతవరం: మొట్టమొదటిసారిగా మండల కేంద్రం నాతవరంలో ఈనెల 8న కలెక్టర్ నిర్వహించనున్న జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమాన్ని ప్రజలు, ప్రజా ప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో హనుమంత వెంకట జయరామ్ తెలిపారు. మన్యపురట్ల సచివాలయ పరిధిలో పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. మండలంలోని 65 పోలింగ్ కేంద్రాల వివరాలను తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాసనాయుడును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1200 మంది కన్నా ఎక్కువగా ఓటర్లున్న ప్రాంతంలో అదనంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈనెల 8న నాతవరంలో కలెక్టరు నిర్వహించే స్పందన కార్యక్రమానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. మండలంలోని అన్ని వర్గాల ప్రజలు తమ సమస్యలపై స్పందనలో కలెక్టరుకు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఇంటింటా ఓటర్లు సర్వేలో సేకరించిన వివరాలను త్వరితగతిన నమోదు చేయాలన్నారు. జగనన్న భూ రీసర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు.ఆర్డీవో వెంట ఏఎస్‌వో ఉలబాల సత్యనారాయణ, వీఆర్వో గణేష్ సిబ్బంది ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి తెలిపారు. 24వ వార్డు శివపురం నూకాలమ్మ తల్లి వీధిలోని సీసీ రోడ్డు నిర్మాణ పనులకు చైర్‌పర్సన్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు ప్రజల నుంచి ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌కు వినతులు వచ్చాయన్నారు. ప్రజల అభ్యర్థన మేరకు సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రతి సచివాలయం పరిధిలో రూ.20 లక్షల చొప్పున ఎమ్మెల్యే మంజూరు చేశారన్నారు. అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, జిల్లా కార్యవర్గ సభ్యులు కొణతాల వరలక్ష్మి, టౌన్ యూత్ అధ్యక్షుడు ధనిమిరెడ్డి ప్రసాద్, పార్టీ నాయకుడు ఏకా రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

కుండపోతగా వర్షం

పలు గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం కుండపోతగా వర్షం కురిసింది. ఈ వర్షం పంటలకు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల నుంచి కొన్ని ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా పంటపొలాలు, గెడ్డల్లోకి నీరు చేరింది.



నాతవరం ఎంపీడీవో, వ్యవసాయశాఖ కార్యాలయాల వద్ద చేరిన నీరు



దేవరాపల్లిలో కుండపోతగా కురుస్తున్న వర్షం

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలో బుధవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు గంటకు పైగా కుండపోతగా వర్షం పడడంతో ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. 5 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదయింది. ఈ వర్షం ఖరీఫ్ సాగుకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పిడుగు పాటుకు పాడి ఆవు మృతి

మండలంలోని ఎం.అలమండలో పిడుగు పాటుకు పాడి ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన పెంటకోట ఎర్రినాయుడు పశువుల పాకపై ఒక్కసారిగా భారీ శబ్దంతో పిడుగు పడింది. దీంతో సుమారు రూ.లక్ష విలువ చేసే ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటనా స్థలాన్ని మాజీ సర్పంచ్ పోతల లక్ష్మి, పోతల శంకరరావు సందర్శించి బాధిత రైతులను పరామర్శించారు.

మాకవరపాలెం: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు పంటలకు ఊపిరిపోశాయి. 15 రోజులుగా సరైన వర్షాలు లేకపోవడం, ఎండ అధికంగా కాయడంతో వరితోపాటు కూరగాయల పంటలకు నీటి తడులు లేకుండా పోయాయి. కాగా గత మూడు రోజులుగా మధ్యాహ్నం వాతావరణం చల్లబడి వర్షం కురుస్తోంది. బుధవారం మధ్యాహ్నం నుంచి వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ వర్షలకు పంటలకు మేలు చేస్తాయని వారు చెప్పారు.

గొలుగొండ: మండలంలోని చిన్నయ్యపాలెం, గొలుగొండ, జోగుంపేట, దారకొండ పరిసర ప్రాంతాల్లో బుధవారం గంట పాటు వర్షం కురిసింది. దీంతో పొలాల్లోకి వర్షం నీరు చేరింది. సరైనా వర్షాలు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ వర్షం ఎంతో ఊరట నిచ్చింది. ఈ వర్షం పంటలకు ఎంతో మేలు చేస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దారకొండపై కురిసిన వర్షం కారణంగా దారగెడ్డలో నీటి ప్రవాహం పెరిగింది.

మాడుగుల రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బుధవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. ఈ వర్షం వరి పంటకు మేలు చేస్తుందని రైతులు తెలిపారు. వర్షాలకు తాచేరు, పాలగెడ్డ, శారదనది, చింతగెడ్డల్లో నీరు చేరింది.

రావికమతం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం కారణంగా మండలంలో బుధవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వర్షం కురిసింది. దీంతో పొలాల్లోకి నీరు చేరింది.

రోలుగుంట: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఒక మోస్తరు వర్షం కురిసింది. రోలుగుంట, భోగాపురం, శరబవరం తదితర గ్రామాల్లో వర్షం కురవడంతో రైతుల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాతవరం: మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి రోడ్లులన్నీ జలమయమయ్యాయి. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు నీటితో నిండిపోయి చెరువులను తలపించాయి. మెయిన్‌రోడ్డుపై పీహెచ్‌సీ వద్ద భారీగా నీరు ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మర్రిపాలెం పాఠశాల ముందు రోడ్డుపై ములగపూడి-ఎ.శరభవరం రోడ్డుపై నీరు పెద్ద ఎత్తున ప్రవహించింది. నాతవరం నుంచి తాండవ వెళ్లే రోడ్డులో పలు చోట్ల నీరు నిల్వ ఉండిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఎగువ ప్రాంతంలో గెడ్డలు పొంగితే తాండవ ప్రాజెక్టులోకి ఓ మోస్తారు నీరు చేరే అవకాశం ఉంటుందని ప్రాజెక్టు అధికారుల అంచనా వేస్తున్నారు.



ఎం. అలమండలో పిడుగు పాటుకు మృతి చెందిన పాడి ఆవు



రావికమతంలో కురుస్తున్న వర్షం

పాత్రికేయులకు సత్కారం

చోడవరం రూరల్: స్థానిక కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వాసవీ క్లబ్, వాసవీ యూత్ క్లబ్‌లు జర్నలిస్టులను సత్కరించాయి. వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ ఉపాధ్యక్షుడు కలగర్ల శేషగిరిరావు నేతృత్వంలో యూత్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కొల్లూరు మణికుమార్, కేతవరపు రామకృష్ణ, కోశాధికారి పూసర్ల కిరణ్, వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పసుమర్తి అశోక్, ఎసి.వి.మధు తదితరులు జర్నలిస్టులను సత్కరించి వారి సేవలను కొనియాడారు.

విస్తారంగా కర్రపెండలం సాగు

కె.కోటపాడు : మండలంలోని పలు గ్రామాల్లో కర్రపెండలం పంటను విస్తారంగా సాగుచేస్తున్నారు. ప్రధానంగా మెట్ట ప్రాంత గ్రామాలైన గరుగుబిల్లి, గొండుపాలెం, దాలివలస, కొరువాడ, గుల్లేపల్లి, డి.అగ్రహారం, పింద్రంగి, ఎరకన్నపాలెం, ఆర్లి, చింతపాలెంలలో 300 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ఈ పంటకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మేలు చేస్తాయి. మెట్ట ప్రాంత గ్రామాల్లో గల భూములు కర్రపెండలం పంటకు అనుకూలంగా ఉండడంతో పాటు పంట దిగుబడి అధికంగా ఉంటుందని రైతులు తెలిపారు. మరో ఇరవై రోజుల అనంతరం దుంపలను తీయనున్నట్టు వారు చెప్పారు.



దాలివలసలో కర్రపెండలం పంట